

పన్నులు చెల్లించే ప్రతిపౌరుడు

## అన్యాయాలు.. సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయాలి

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశ్విని కుమార్

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్ :** పన్నులు చెల్లించే ప్రతిపౌరుడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై, నెలకొన్న సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయాలని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ పిలుపునిచ్చారు.ఈ మేరకు రాజస్థానీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో 37వ శ్రీరామకృష్ణ ధూత్ స్మారక ఉపన్యాసం జరిగింది. సురక్షిత భారత్' అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి అజయ్ అగర్వాల్, రామ్నాథ్ గోవింద్ ముఖ్య అతిథులుగా విచ్చేయగా.. రాజస్థానీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మనోజ్ గోయల్, సదస్సు చైర్మన్ డాక్టర్ మోహన్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ ఆనంద్ శర్మ, ట్రెజరర్ సీఏ సందీప్ ఝువార్ తదితర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, ముఖ్య వక్త అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ... ధర్మాన్ని ఎప్పుడూ జై అనాలి, అధర్మానికి పాల్పడే వారిని ప్రభుత్వం కఠినంగా దండించాలన్నారు. చిన్న దొంగతనాలను సీరియస్ గా తీసుకునే ప్రభుత్వాలు, భూ కబ్జాల (ల్యాండ్ గ్రాబ్బింగ్) వంటి పెద్ద నేరాలను సీరియస్ క్రైమ్‌గా పరిగణించడం లేదని, సివిల్ ఇష్యూలపై ప్రభుత్వాలు అలసత్వం వహించడం తగదని విమర్శించారు.

## కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక ఆల



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రియాంక ఆల ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. తాజాగా జరిగిన ఐఏఎస్‌ల బదిలీలో ఆమె హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియాంక ఆలను హైదరాబాద్ కలెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.




## కలైడో ఖేల్-ఏ-థాన్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** శారీరక పరిమితులు కేవలం శరీరానికే తప్ప.. సాధించాలనే సంకల్పానికి కావని కలైడో ఖేల్‌ఏథాన్ నిరూపించింది. ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఆదివారం నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన ఆన్ ఇంక్లూజివ్ స్పోర్ట్స్ 4 ఆల్ 5కె రన్' నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంది. క్రీడలు అందరి సొంతం అనే నినాదంతో సాగిన ఈ పరుగులో కుల, మత, వయో భేదాలు లేకుండా వందలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పరుగును ఉద్దేశించి టిజిటిఎఫ్ వ్యవస్థాపకుడు రఘు మాట్లాడుతూ.. సమాజంలో సమ్మిళిత భావాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రన్‌లో సినీ నటుడు రాగ్ మయూర్, భారత దివ్యాంగుల క్రికెట్ జట్టు కెప్టెన్ మహేష్ దీరావత్, హైదరాబాద్ రోడ్ వారియర్ అరుణ్ బతుల, ఇండోఅమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ శ్రీదేవి దేవిరెడ్డి, టై హైదరాబాద్ సీనియర్ డైరెక్టర్, శాంతల వైగాస్, ఆరా గ్లోబల్ బిజినెస్ స్కూల్ వాణి మేక తదితరులు పాల్గొన్నారు.

## వాహన పార్కింగ్ వివాదం

### విచారణ చేపట్టిన హుస్సేనీ ఆలం పోలీసులు

**ప్రజాపక్షం/చార్మినార్ :** ద్విచక్రవాహన వివాదం ఫిర్యాదు వరకు వెళ్లింది. అడ్వకేట్ ఫిర్యాదు మేరకు హుస్సేనీఆలం పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం. హైకోర్టు గేట్6కు ఎదురుగా దుకాణాల సముదాయం అరుగులపై సలీం(70) అనే వ్యక్తి టైపంగ్ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం ఓ అడ్వకేట్ సలీం కూర్చునే స్థలం ముందు భాగంలో తన ద్విచక్రవాహనాన్ని పార్క్ చేశాడు. ఈ విషయంలో సలీం అభ్యంతరం చెప్పడంతో వివాదం మొదలయ్యింది. ఓ దశలో ఇరువురి మధ్యన తోపులాట కూడా చోటుచేసుకుంది. ఇది గమనించిన స్థానికులు అక్కడికి వచ్చి అడ్వకేట్ దురుసు ప్రవర్తనపై సున్నితంగా మందలించారు. అయితే అక్కడి నుంచి వెళ్లిపోయిన అడ్వకేట్ హుస్సేనీఆలం పోలీసులు ఘటనపై ఫిర్యాదు చేయడంతో ఏకంగా ఏసీపీ విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటన ఓ వృద్ధుడి జీవనోపాధి.. వాహనాల పార్కింగ్ వ్యవహారం తీవ్రతను వ్యక్తం చేస్తున్నది.




## ఘనంగా వాసవి మాత జయంతి ఉత్సవం

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లా కలక్టరేట్‌లో ఆదివారం వాసవి మాత జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది వైశాఖ శుక్ల పక్ష శతిమి నాడు రాష్ట్ర ప్రభుత్వం వాసవిమాత జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నందకిషోర్ తెలిపారు. ఈ సంధర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి వాసవిమాత చిత్ర పటానికి పూల మాల వేసారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వెంగళరావునగర్ ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో...

**ప్రజాపక్షం/వెంగళరావునగర్ :** వాసవీ మాత జయంతి వేడుకలు మధురానగర్, వెంగళరావునగర్ ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వెల్లంకి ఎదురుగా భక్తులందరికీ మజ్జిగ, పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమాన్ని సురేష్, సంతోష్, శ్రీనాథ్, శ్రీకర్, కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కే.రాజశేఖర్, డాక్టర్ మురళీధర్ గుప్తా, శశికళ పాల్గొన్నారు.

# ఇంట్లోనే కూర్చుని స్వీయ గణన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత జనగణన ప్రక్రియ ఆదివారం అధికారికంగా ప్రారంభమైంది. ఈ దఫా సాంకేతికతతో ప్రభుత్వం ప్రజలకు 'స్వీయ గణన' చేసుకునే వెసులుబాటును కల్పించింది. మే 10వ తేదీ వరకు ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

33 ప్రశ్నలకు 27 ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు ఇవ్వాలి..

ఉద్యోగ రీత్యా బిజీగా ఉండేవారు లేదా ఇతర ప్రాంతాల్లో నివసించే వారికి ఈ విధానం ఎంతో మేలు చేస్తుంది. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, తప్పుడు సమాచారం నమోదయ్యే అవకాశం ఉండదు. జనగణనలో మొత్తం 33 ప్రశ్నలు ఉండగా, స్వీయ గణనలో 27 ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన 6 ప్రశ్నలను ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్ పూర్తి చేస్తారు. మీరు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత వచ్చే ఐడిని వారికి చూపిస్తే సరిపోతుంది. ఇందులో ఆస్తుల వివరాలు కానీ, బ్యాంక్ వివరాల ప్రస్తావన కానీ ఉండదు. కేవలం ఇల్లు, అందులోని సౌకర్యాలు, కులం (తొలి దశలో ఎస్‌సి, ఎస్‌టి మాత్రమే) వివరాలు మాత్రమే సేకరిస్తారు.

- ప్రజలు తమ స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా దశల వారిగా నమోదు చేయవచ్చు.
- **పోర్టల్ సందర్శన :** మొదట https://se.census.gov.in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి.
- **ప్రాథమిక వివరాలు :** రాష్ట్రం పేరు ఎంచుకుని, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి.
- **లాగిన్ :** కుటుంబ యజమాని పేరు, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడిని నమోదు చేయాలి.
- ఒక కుటుంబానికి ఒక మొబైల్ నంబర్ మాత్రమే అనుమతిస్తుంది.
- **వెరిఫికేషన్ :** మీకు నచ్చిన భాషను ఎంచుకుని, మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటిపి ద్వారా పరిశీలన చేయాలి.
- **చిరునామా :** జిల్లా, పిన్‌కోడ్ గ్రామం లేదా పట్టణం వివరాలను ఎంపిక చేసుకోవాలి.
- మ్యాప్‌లో మీ ఇల్లు ఉన్న చోటికి 'రెడ్ మార్క్'ను డ్రాగ్ చేయాలి.
- **ప్రశ్నావళి :** ఇళ్ల జాబితాకు సంబంధించిన ప్రశ్నలన్నింటిని పూర్తి చేయాలి.
- **సబ్మిషన్ :** వివరాలన్ని నమోదు చేశాక ప్రివ్యూ చూసుకుని, సరిచూసుకున్న తర్వాత ఫైనల్ సబ్మిట్ చేయాలి.

**'హెచ్' ఐడి ప్రాముఖ్యత..**

సబ్మిట్ చేసిన తర్వాత మీకు 'హెచ్' అక్షరంతో మొదలయ్యే 11 అంకెల విశిష్ట సంఖ్య (ఎస్‌ఈఐడి) వస్తుంది. దీనిని జాగ్రత్తగా రాసుకోవాలి. జనగణన సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు ఈ ఐడి నెంబర్‌ని వారికి చూపిస్తే, వారు తమ వద్ద ఉన్న డేటాతో సరిపోల్చి ప్రక్రియను పూర్తి చేస్తారు.

# గుర్తింపు రావడం లేదనే కెసిఆర్‌పైన విమర్శలు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ముఖ్యమంత్రితో సహా కొంతమంది తమకు సరైన గుర్తింపు రావడం లేదనే కెసిఆర్‌పైన విమర్శలు చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. కెటిఆర్ సమక్షంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు పిల్లుట్ల రఘు తదితరులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ ఆదివారం చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ యాక్టర్లు, యాంకర్లు, చివరికి ప్రజలు కూడా రేవంత్ రెడ్డి పేరును ఎత్తడానికి సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను కూడా మోసం చేసిందని ఆరోపించారు. ఎవరు ఎన్ని రకాల కుటిల ప్రయత్నాలు, తెలంగాణ వ్యతిరేక కుట్రలకు పాల్పడినా రానున్న శాసనసభ ఎన్నికల్లో కెసిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**జిల్లా కేంద్రాల్లో గులాబీ జెండాలు ఎగురవేయాలి**

బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో గులాబీ జెండాలను ఎగురవేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పార్టీ శ్రేణులను కోరారు. ఇటీవల జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో, ప్రస్తుత ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈసారి బిఆర్ఎస్ ప్లీనరీని కేవలం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికే పరిమితం చేసినట్టు వివరించారు. ఇందులో భాగంగానే సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ శ్రేణులతో కెటిఆర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం, మండలం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించాలని కెటిఆర్ పిలుపు నిచ్చారు.

# పాత నేరస్థులపై నిఘా

సైబర్ నేరాలకు చెక్ పెట్టే లక్ష్యంతో క్రాక్‌డౌన్ 2.0



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0 చేపట్టింది. ఇప్పటికే అరెస్టైన సైబర్ నేరస్థులపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేస్తూ, పునరావృత నేరాలను అడ్డుకోవడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యమని టిజిసిఎస్‌బి డిజి శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రారంభమైన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో టిజిసిఎస్‌బితో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసు బృందాలు సమన్వయంతో పనిచేశామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 300 పోలీస్ టీంలు ఒకేసారి ఫీల్డ్ వెరిఫికేషన్ చేపట్టి, గతంలో అరెస్టైన నిందితుల ప్రస్తుత నివాసం, ఉద్యోగం, కార్యకలాపాలపై సమగ్ర సమాచారం సేకరించామన్నారు. 2024–2025 మధ్య తెలంగాణలో మొత్తం 3,567 మంది సైబర్ నేరస్థులు అరెస్టయ్యారు. వీరిలో రాష్ట్రానికి చెందిన 614 మందిని ఎంపిక చేసి, ఆర్థిక మోసాలకు సంబంధంతో పాటు పలు కేసుల్లో ప్రమేయం ఉన్న 335 మందిపై ప్రత్యేకంగా విచారణ జరిపామని పేర్కొన్నారు. ఈ నిందితులు తెలంగాణలో 480 కేసులు, దేశవ్యాప్తంగా 1,233 కేసులతో సంబంధం కలిగి ఉన్నట్లు వెల్లడైంది. ఈ ఆపరేషన్‌లో 218 మంది నిందితులను ట్రేస్ చేయగా, కొందరు పాత చిరునామాల్లోనే ఉండగా మరికొందరు ఉద్యోగాల కోసం మారినట్లు గుర్తించామన్నారు. 115 మంది ఇంకా కనిపించకపోవడంతో గాలింపు కొనసాగుతోందన్నారు. 3 మంది మరణించినట్లు తెలిసిందన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఫిజికల్ వెరిఫికేషన్, ఇంటెలిజెన్స్ సేకరణ, నెట్‌వర్క్ మ్యాపింగ్, బెయిల్ నిబంధనల అమలు, అనుమానాస్పద ప్రవర్తనపై నిఘా వంటి ఐదు కీలక అంశాలపై దృష్టి పెట్టారు. అనుమానాస్పద ప్రవర్తన ఉన్న వారి పై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసి కఠిన పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో ఒక కేసులో నిందితుడు ప్రసాద్ కుమార్ ప్రస్తుతం నేపాల్‌లో నివసిస్తున్నట్లు గుర్తించారు. అతను గతంలో సికింద్రాబాద్‌లోని ఒక రెస్టారెంట్‌లో చెఫ్‌గా పనిచేసినట్లు సమాచారం.

బెంగాల్ ప్రజలను అవమానిస్తున్న...

# మోదీకి తగిన గుణపాఠం చెప్పండి

ఆప్ అగ్రనేత, మాజీ ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ పిలుపు

'దీదీ'ని గెలిపించాలని బల్లిగంజ్ ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి ప్రసంగం

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితా నుంచి ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ కింద 27లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించడం వెనక బిజెపి –ఇసి కుట్ర ఉందని, వారి పౌరసత్వ పత్రాలను లక్ష్యంగా చేసుకున్న భారీ చర్యల్లో ఇది ఒక భాగమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆయన ఆదివారం ఇక్కడి బల్లిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. కేజ్రీవాల్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ ఎన్నికల కోసం 3.5 లక్షల మంది భద్రతా సిబ్బందిని మోహరించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర ప్రజలను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితాలో నుంచి తొలగించబడిన వారంతా తృణమూల్ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని కేజ్రీవాల్ పిలుపునిచ్చారు.
'ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కే ఓటు వేయాలని మీరు అంతా వెళ్లి మీ స్నేహితులు, బంధువులు, పొరుగువారికి చెప్పండి. బిజెపికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దీదీ తప్పక గెలవాలి. ఎన్నికలలో గెలిచేందుకు ఎన్నికల గేమ్ ప్లాన్‌లో భాగంగా మీ పౌరసత్వ హక్కులను గుంజుకోవాలని చూసిన వారికి బుద్ధి చెప్పండి. గుర్తుంచుకోండి వారు (బిజెపి) మీ రేషన్ కార్డులవంటి పౌరసత్వ పత్రాలను రద్దు చేయిస్తారు. కేవలం మమతా బెనర్జీ మాత్రమే మీకు సహాయం చేయగలదు. ఆమె మీకు అండగా నిలబడుతుంది' అని ఆయన చెప్పారు. ఎన్నికలను ప్రభావితం చేయడానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రం వెలుపల ఉన్నవారికి ఫోన్లు చేస్తున్నారని, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏడుగురు రాష్ట్రంలో ప్రచారం చేస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. పోట్టిగా ఉన్న ఒక మహిళ నరేంద్రమోదీ, అమిత్‌షాలకు దీటుగానిలబడి బిజెపికి సవాల్ విసురుతున్న తీరును మనం గమనించాలన్నారు. 'మోదీజీ ఒక అసెంబ్లీ ఎన్నికల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ కేంద్ర సంస్థలతో పాటు 3.5లక్షల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. అసలేమి జరుగుతోంది? బెంగాల్ ప్రజలు ఏమైనా ఉగ్రవాదులా ? అని అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు.

# తీవ్ర వేసవి వడగాలుల్లో భారత్

ప్రపంచంలో 98 ఉష్ణ నగరాలు మనదేశంలోనే..

రాబోయే ఏడు రోజుల్లో వడగాలి కుదుపు

**న్యూఢిల్లీ :** ఈ వేసవికాలంలో భారతదేశంలోని అనేక ప్రాంతాలు తీవ్ర వడగాలులమధ్య అట్టుడికిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల నేపథ్యంలో అత్యంత వేడి వాతావరణం ఉన్న 100 ప్రపంచ నగరాలలో 98 నగరాలు భారతదేశంలోనే నమోదయ్యాయి. రాబోయే ఏడు రోజుల్లో వడగాలులు అనేక ప్రాంతాలకు కుదిపేస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. దీనిబట్టే మనదేశం ఎంత వేడి తీవ్రతతో అల్లాడిపోతోందో అర్థం అవుతంది. ఎక్యూటీ డేటా ప్రకారం, ప్రపంచ వడగాలుల కేంద్రీకృత ప్రాంతం భారతదేశమే. దేశంలోని అనేక ప్రాంతాలలో వేడిగాలులు 40 డిగ్రీల సెంటీగ్రేడ్స్ దాటాయి. మరికొన్ని ప్రాంతాలలో వేడిగాలులు 45 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌కు చేరుకున్నాయి. ఈ ధోరణి రోజులు గడిచేకొద్దీ పెరుగుతోంది. నగరాల్లో సాధారణంకంటే ఎక్కువస్థాయికి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.ఉత్తర ప్రదేశ్‌లోని ఇర్రై, ఔరైయా ప్రాంతాలతోసహా రాజస్థాన్‌లోని జైసల్మేర్, ఫలోదీ ప్రాంతాలలో కూడా వడగాలులు ఉద్ధృతంగా ఉన్నాయి. అనేక నగరాలలో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌వరకూ పెరిగాయి. ఇర్రై, ఔరైయా నగరాలు సహా జైసల్మేర్, ఫలోదీలలో కూడా ఎక్యూఐ కాలుష్యం విపరీతంగా పెరిగింది. పెరుగుతున్న వేడిగాలులమధ్య దేశంలోని వాతావరణశాఖ ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పదే పదే చెబుతోంది. చాలా ఎక్కువ సమయం ఎండలో ఉండటంవల్ల తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతారని, వడదెబ్బ తగులుతుందని, ఈ వడగాలులు తీవ్రమైన విద్యుత్ వాడకానికి, దారుణమైన నీటి కొరతకు దారితీస్తున్నాయని హెచ్చరించింది. ప్రస్తుతం కొనసాగుతున్న వేడిగాలుల వల్ల వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయన్న ఆందోళన పెరుగుతోంది.

## రఘు రాయ్ మృతి పత్రికా రంగానికి తీరని లోటు

తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశపు అత్యంత ప్రఖ్యాత ఫొటో జర్నలిస్టు రఘు రాయ్ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం (టిఎస్ పిజెఎ) సంతాపం వ్యక్తం చేసింది. దేశంలో ఫొటో జర్నలిజానికి మార్గదర్శకుడిగా పేరుగాంచిన ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె. నరహరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతదేశంలో ఫొటో జర్నలిజానికి మార్గదర్శకుడిగా గుర్తింపు పొందిన రఘు రాయ్, దశాబ్దాల భారత చరిత్రను తన కెమెరాలో బంధించిన గొప్ప ఛాయాచిత్రకారుడిగా పేరు పొందారని కొనియాడారు. భారత ఆధునిక చరిత్రకు సంబంధించిన అనేక కీలక ఘటనలను, ఇందిరా గాంధీ, మదర్ థెరిసా, బంగ్లాదేశ్ శరణార్థుల సంక్షోభం, భోపాల్ గ్యాస్ విషాదం వంటి సంఘటనలను తన చిత్రాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. ఫొటో జర్నలిజం రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసిందని గుర్తు చేశారు. రఘు రాయ్ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసిన సంఘం నాయకులు, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** కాలజ్ఞాన కర్త వీరబ్రహ్మేంద్ర స్వామి 333 ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ట్యాంక్‌బండ్‌పై జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అట్లూరి రవీంద్ర చారి శైలేంద్ర చారి, బీసీ కుల సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలబోజు నరసింహాచారి, తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్ అనంతోజు బ్రహ్మాచారి తదితరులు మాట్లాడుతూ... భూత, భవిష్యత్, వర్తమానం గురించి ముందే తెలియజేసిన మహనీయుడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఒక్కరే అని కొనియాడారు. బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు ప్రతి గ్రామంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## బిఆర్ఎస్ అంటేనే సోషల్ మీడియా పార్టీ : టిఆర్ఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ అంటేనే సోషల్ మీడియా పార్టీ అని 'తెలంగాణ రాష్ట్ర సేన' (టిఆర్ఎస్) నాయకులు ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కవిత ఇచ్చిన మాస్టర్ స్ట్రోక్‌తో బిఆర్ఎస్ నాయకులు మతి తప్పి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎల్.రూప్ సింగ్,రంగు నవీన్ ఆచారి, సయ్యద్ ఇస్మాయిల్, గొంగళ్ల రంజిత్ కుమార్,మంచాల వరలక్ష్మి , నరేశ్ ప్రజాపతి మీడియాతో మాట్లాడుతూ టిఆర్ఎస్ పేరును ప్రకటించగానే బిఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియాలో ఒరిజినల్, డూప్లికేట్ అంటూ పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. టిఆర్ఎస్‌కు నిజమైన హక్కుదారు కవితనే అని, బిఆర్ఎస్ వదిలేసిన తెలంగాణ వాదాన్ని కవిత తన భుజాన ఎత్తుకున్నారని వారు గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ వాదులను లాఠీలతో కొట్టించిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని మండిపడ్డారు.



## 'నూతన ఆవిష్కరణ'లతో వైద్యరంగ భవిష్యత్తును తీర్చిదిద్దడమే లక్ష్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్య విద్య,నూతన ఆవిష్కరణల ద్వారా వైద్య రంగ భవిష్యత్తును తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి అన్నారు. 'యశోద హాస్పిటల్స్‌సికింద్రాబాద్, సెంటర్ ఫర్ న్యూరోఎండోస్కోపీ' (వైసిఎన్ఇ ) ఆధ్వర్యంలో 'ఇంటర్‌నేషనల్ స్కల్ బేస్ ఎండోస్కోపీ సమ్మిట్ 2.0' మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో 500ల మందికిపైగా ప్రముఖ జాతీయ,అంతర్జాతీయ వైద్య నిపుణులు పాల్గొన్నారు. యశోద సెంటర్ ఫర్ న్యూరోఎండోస్కోపీ ,న్యూరోఎండోస్కోపీ రంగంలో క్లినికల్ ఎక్స్‌లెన్స్, శిక్షణ, పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ అయ్యాదురై మాట్లాడుతూ స్కల్ బేస్ సర్జరీకి అత్యంత ఖచ్చితత్వం, నైపుణ్యం, నిరంతర అభ్యాసం అవసరమన్నారు. అమెరికాకు చెందిన డాక్టర్ థియోడర్ హెచ్ ష్వారట్జ్ , హాంగ్ కాంగ్‌కు చెందిన డాక్టర్ కాల్విన్ మాక్, సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్. అయ్యదురైతో పాటు హాస్పిటల్స్ సికింద్రాబాద్ యూనిట్ హెడ్ డాక్టర్. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ :: ఉప్పల్ సర్కిల్-9**

**NIT No.** TENDER NOTICE NIT No. 06/EEC-9/UPL/MMC/2026-27, తేది: 25.04.2026, **పని పేరు:** 1 పని కొరకు ఎంఎంసి, ఉప్పల్ సర్కిల్, వార్డ్ నెం.28–ఉప్పల్, "ఉప్పల్ X రోడ్డు వద్ద జరుగుతున్న ఎలివేటెడ్ కారిడార్ పనుల కారణంగా ట్రాఫిక్ మళ్లింపు దృష్ట్యా, తాత్కాలిక బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసే నిమిత్తం నల్లకుంట చెరువు వద్ద షెడ్డు నిర్మాణం, **అంచనా విలువ:** రూ.13.80 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం:** 28–04–2026 మ.02.00గం.ల వరకు, **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీ జి.హరికిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్–9, ఎంఎంసి. మరిన్ని వివరాలకు ఇ–ప్రొక్యూర్‌మెంట్ @http://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్–9, ఎంఎంసి.

DIPR R.O. No. : 1494-PP/CL/ADVT/2026-27, Date: 26-04-2026

## వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వంగూర్ :** వంగూర్ మండల పరిధిలోని ఉల్పల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి కుమారుని వివాహ వేడుకల్లో ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదింటి యువతి పెళ్లి



**ప్రజాపక్షం/అమరచింత:** అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 29న పేదింటి యువతి పెళ్లి చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.ఎస్.సరోజనమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సిఐ శివ కుమార్, ఎస్ఐలు జయన్న, స్వాతికి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదింటి యువతి వివాహనికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికీ 17 మంది పేద యువతుల వివాహాలు జరిపించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆత్మకూరు మండలం పిన్నంచర్ల గ్రామానికి చెందిన నిరుపేద వికలాంగుడైన జయమ్మ కూతురు శృతి వివాహం ఈనెల 29న తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పేదింటి అమ్మాయి వివాహం జరిపించడానికి దాతలు సైతం ముందుకు వస్తున్నారని అన్నారు. ఈనెల 29న ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో జరిగే నిరుపేదింటి అమ్మాయి పెళ్లికి సిఐ, ఎస్ఐ లకు ఆహ్వానించామని వారు సైతం తమ స్వచ్ఛంద సంస్థ పేద యువతి పెళ్లి చేస్తున్నందుకు అభినందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రశేఖర్, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వాసవిమాత జయంతి ఉత్సవాలు

**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ పట్టణంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి పుష్కరిణి (కోనేరు) నుండి 108 మంది కన్నెపిల్లలచే కలశ ఊరేగింపు శోభాయామానంగా జరిగింది. కోనేరులో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారం రథోత్సవంలో అమ్మవారి చిత్రపటాన్ని ఉంచి కలశ ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా శోభాయామానంగా కొనసాగింది. చిన్నారులు, మహిళలు, పురుషులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఊరేగిపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా, ఆలయ అధ్యక్షులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, ఆర్య వైశ్య సంఘం నాయకులు కొత్త జగదీష్ గుప్తా, మనసాని వెంకటేష్, దొంత నరహరి, మనసాని నాగరాజు, బిలకింటి జగదీష్, బిలకంటి నర్సయ్య, ఆళ్ల గడ్డ శ్రీనివాస్, వాసవి రాము, గుగ్గిళ్ల కృష్ణయ్య, ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకులు కొత్త విజయలక్ష్మి , కొత్త మీరాబాయి, మనసాని సరళ, వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వాల ప్రసన్న , కిషోర్, సభ్యులు కట్ల ఉషారాణి,మనసాని దేవి, బి.పద్మ, అగ్లార్ లక్ష్మి , పాలుట్ల సుష్మ, చల్లా రూప, గుగ్గిళ్ల శోభ, పల్లవి, పద్మావతి, శారద, శ్రీలత, అగ్లార్ రేఖ, తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/మాగనూరు:** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ఈనెల 29 నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, కార్యదర్శి భరత్ కుమార్, కోశాధికారి కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న బుధవారం నరసింహ జయంతి సందర్భంగా ఉత్సవాలు ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. ఆలయ పూజారి రాములు ఇంటి నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఆలయానికి తీసుకువస్తోందని అనంతరం అభిషేకం, నైవేద్యం, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 30న గురువారం స్వామివారికి గంధలేపనం, విశిష్ట అభిషేక సేవ ఉంటుందని వివరించారు. మే 1న శుక్రవారం ఉదయం 5.15 గంటలకు ప్రథోత్సవం, ఉదయం 10.08 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. అదే రోజు గండ జ్యోతులు, సాయంత్రం గంగాపూజ, తెపోత్సవం , రాత్రి 9 గంటలకు రెట్ల పట్ల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. మే 2న శనివారం తెల్లవారుజామున 5 గంటలకు రథోత్సవం, సాయంత్రం పాల ఉట్లు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మే 3న ఆదివారం ఉదయం 8.45 గంటలకు శేష వాహన సేవ, గరుడ వాహన సేవ, సాయంత్రం 4.55 గంటలకు హనుమాన్ వాహన సేవ జరుగుతుందన్నారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను తిరిగి పూజారి రాములు ఇంటికి తీసుకెళ్లడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/దామరగిద్ద:** దామరగిద్ద మండల పరిధిలోని ముసాపేట స్టేజి దగ్గర గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సర్పంచ్ సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవితాపాన్ని దృష్టిలో పెట్టుకొని స్టేజ్ దగ్గర ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ప్రారంభించి మంచినీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని అన్నారు. ప్రజలందరూ దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంజిలయ్య గౌడ్, ఉసెనప్ప, వెంకటయ్య గౌడ్, ఎస్.గోవిందు గౌడ్, గోవిందు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాల్‌రెడ్డి ఎన్నిక

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండలం గోపాల్‌దిన్నె గ్రామానికి చెందిన రైతు నాయకుడు బాల్‌రెడ్డి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడురోజుల పాటు నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నాడు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి ఎంపిక కావడం పట్ల మండలంలో రైతులు, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో బాధ్యతలు చేపట్టిన అనంతరం రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని బాల్‌రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికతో వీపనగండ్ల మండలానికి గౌరవం దక్కిందని స్థానికులు పేర్కొన్నారు.

# తప్పుల్లేకుండా వివరాలు నమోదు

స్టేడియం గ్రౌండ్ వద్ద స్వీయ గణనను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
మే 10 వరకు స్వీయ గణన



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లాలో జనాభా గణన 2027 లో భాగంగా స్వీయ గణన జిల్లాలో ప్రారంభమైంది. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, జిల్లా స్పోర్ట్స్ స్టేడియం కమాన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి జనాభా గణన 2027 భాగమైన మొదటి దశ సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమాన్ని లాంఛనంగా వారు ప్రారంభించారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్వీయ గణనలో భాగంగా ట్యాబ్ ద్వారా వివరాలను సెన్సస్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2011 సంవత్సరం తర్వాత 2021లో నిర్వహించాల్సిన జనాభా గణన కరోనా కారణంగా నిలిచిపోయిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సెన్సస్ 2027ను ప్రారంభించాయని తెలిపారు. మొదటిసారిగా జనాభా గణన డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని చెప్పారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరుగుతున్న మొదటి దశ స్వీయ గణన ప్రక్రియలో ప్రజలు 100 శాతం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు సెన్సస్ పోర్టల్‌లో కంప్యూటర్, మొబైల్, టాబ్ ద్వారా తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరు స్వీయ గణన లో పాల్గొని, తప్పు లేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సెన్సస్ 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజలు సెన్సస్ పోర్టల్, వెబ్‌సైట్‌లో తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. 2011 తర్వాత మళ్లీ ప్రభుత్వం జనాభా గణన ప్రారంభించిందని పేర్కొన్నారు.

**హ్యాపీ సండే కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు**

మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆదివారం నిర్వహించే హ్యాపీ సండే కార్యక్రమంలో చిన్నారి, మ్యాజిక్ షోలు, ఆటపాటలతో ప్రజలను అలరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ, పట్టణ మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ , డిపిఆర్ఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

**జర్నలిస్టులు - రాజకీయ నాయకులు సమాజ శ్రేయస్సు కోసం కలిసి పనిచేయాలి**

మహబూబ్ నగర్ పట్టణంలో క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు, రాజకీయ నాయకులు వేర్వేరు కాదని, ఇద్దరూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పక్కపక్కనే ప్రయాణిస్తారని తెలిపారు. జర్నలిస్టులను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని, వారు సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తారని అన్నారు. మంచి పనులను ప్రజలకు చేరవేయడం జర్నలిస్టుల బాధ్యత అని, తప్పులు జరిగితే వాటిని సరిదిద్దే బాధ్యత కూడా వారిదేనని పేర్కొన్నారు. '' మీ కలానికి ముగింపు లేదు... రాజకీయాలు శాశ్వతం కాదు'' అంటూ జర్నలిస్టుల పాత్ర ప్రాముఖ్యతను వివరించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం ప్రింటర్లు, కంప్యూటర్లు అందించనున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టులు, రాజకీయ నాయకులు తమ బాధ్యతలను మరిస్తే సమాజానికి నష్టం జరుగుతుందని హెచ్చరించారు. మహబూబ్ నగర్ జిల్లాను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలపడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, బెక్కెం జనార్ధన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరేందర్ చారి, కార్యదర్శి నరేందర్ గౌడ్, కోశాధికారి పల్లెమోని యాదయ్య, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ కలెక్టర్‌గా హేమంత కేశవ్ పాటిల్ బాధ్యతలు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా 9వ కలెక్టర్‌గా 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హేమంత కేశవ్ పాటిల్ ఆదివారం అధికార బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బాధ్యతల నుంచి రిలీవ్ అవుతూ, నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌గా సేవలందిస్తున్న హేమంత కేశవ్ పాటిల్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మేరకు ఆయన తక్షణమే బాధ్యతలు చేపట్టారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది నూతన కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు సమర్ధవంతంగా చేరేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం అత్యంత ముఖ్యమని, ప్రతి అధికారి తన బాధ్యతలను నిబద్ధతతో, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల రంగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం , పాఠశాలల నాణ్యత , వైద్య సేవల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రజలతో ప్రత్యేకంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని సమర్ధవంతమైన పరిష్కార మార్గాలు కనుగోనడం తన విధానమని జిల్లా పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా కృషి చేస్తామని హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు.

## 'స్కాలర్స్' కళాశాల విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** వనపర్తి పట్టణంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో స్కాలర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం బైపీసీ లో బి.మహలక్ష్మి , ఆలీషా జి, సుస్మిత, భార్గవి, ఎంపీసీలో కే.నర్మదా, కే.శిరీష, కే.లలిత, ప్రథమ సంవత్సరం బైపీసీలో డి.పల్లవి, అఫ్సిన్, బి.అక్షయలక్ష్మి , ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఏ.బన్నీ రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులను వీరిని ప్రోత్సాహించిన అధ్యాపకులను, విద్యార్థులు తల్లిదండ్రులను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బి.శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** టిసిఆర్ ఫౌండేషన్ గాయత్రి హాస్పిటల్ వైద్యుల బృందం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల పరిధిలోని మేడిపూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయిందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మేడీపూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మండల పరిధిలో గల ఆయా గ్రామాల నుంచి అధికసంఖ్యలో హాజరయ్యారని గ్రామ సర్పంచు మల్లేష్, గుంత కోడూరు సర్పంచు వార్ల వెంకటయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమానికి టిసిఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు టి.చిన్నప్ప రెడ్డి, ఆనంద్‌రెడ్డి, డాక్టర్ అఖిలేష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో 'సండే - ఫన్‌డే'

పాల్గొన్న చైర్మన్ అక్కి శ్రీనివాస గౌడ్



**ప్రజాపక్షం/పెబ్బేరు:** రాష్ట్ర పురపాలక శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో 'సండే ఫన్‌డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకే మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో యోగా కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో చైర్మన్ తో పాటు మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. నిత్యం నిధులతో ఒత్తిడికి లోనయ్యే ఉద్యోగులకు, ప్రజలకు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 99 రోజుల కార్యాచరణ ద్వారా పట్టణాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అభివృద్ధిలో భాగస్వాములయ్యే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. యోగా నిపుణుల సమక్షంలో సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, వివిధ రకాల ఆసనాలను అభ్యసించారు. ప్రతి ఆదివారం సండే ఫండే లో భాగంగా క్రీడలు, సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని మున్సిపల్ యంత్రాంగం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర, ఎల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా అరిఫుద్దీన్, కౌన్సిలర్ జములమ్మ, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది , పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. యోగా ద్వారా రోజంతా ఉత్సాహంగా గడిపే అవకాశం లభిస్తుందని సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం

ఖరీఫ్ సాగుకు రైతులకు మార్గదర్శనం
ఇన్‌చార్జి శాస్త్రవేత్త డాక్టర్ టి.రాజశ్వేర్ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్:** జిల్లా రైతులకు వానాకాలం ఖరీఫ్ సాగుపై శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యక్రమ ఇన్‌చార్జి శాస్త్రవేత్త డాక్టర్ టి.రాజశ్వేర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం నేటి నుంచి మే 23 వరకు నెల రోజుల పాటు కొనసాగనుంది. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సుమారు 40 గ్రామాల్లో ఐదు శాస్త్రవేత్తలు బృందాలు పర్యటిస్తూ రైతులకు ప్రత్యక్షంగా శిక్షణ అందించనున్నాయి. వ్యవసాయ రంగంలో పాటించాల్సిన ఆధునిక పద్ధతులు, శాస్త్రీయ సూచనలు నేరుగా రైతులు వద్దకే చేరేలా ఈ కార్యక్రమాన్ని వర్షాకాలానికి ముందుగానే చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ పరిశోధన కేంద్రాల్లో పనిచేస్తున్న నిపుణులు రైతులు ఖరీఫ్ పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు సూచించనున్నారు. ఈశిక్షణల్లో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు ఎంపిక, మెరుగైన విత్తన రకాలు, ఎరువులు యాజమాన్యం, యూరియా వినియోగం తగ్గింపు,సమతుల్య పోషకాలు అందించే విధానం, నేల ద్వారా పోషకాలు అందించే విధానం, వ్యాపించే తెగుళ్లు, పురుగుల నియంత్రణకు విత్తన శుద్ధి, సాగునీటి పొదుపు వంటి అంశాలపై వివరాలు తెలియజేస్తారు. జిల్లాలోని కోస్గి, మగనూర్, నారాయణపేట్, మద్దూర్, కృష్ణ, మక్తల్, ధన్వాడ, మరికల్, ఉట్కూర్, మండలాల్లోని రైతు వేదికల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ శాఖతో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై లబ్ధి పొందాలని డాక్టర్ టి.రాజశ్వే రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కల్వరాలలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండలంలోని కల్వరాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతోంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన తడకల కవిత, మినిగా అలివేలుకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు తనయుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు జూపల్లి అరుణ్, వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లంకల గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ నిర్వహించి, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం గ్రామపంచాయితీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మొత్తం 25 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ద్వారా పేదలకు సొంత ఇల్లు కలగడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, గ్రామ సర్పంచు బండారి రాముడు, ఉపసర్పంచు తడకల రంగమ్మ, పానుగల్ మాజీ ఎంపీపీ వెంకటేశ్ నాయుడు, హౌసింగ్ ఏఈ మస్తాన్, గ్రామ పంచాయితీ కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చక్ర వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి మాత జయంతి ఉత్సవాలు





**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవీ మాత చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పూల మాలలు సమర్పించారు. త్యాగ నిరతి, ధర్మ నిష్ఠ, సమాజ హిత భావనకు ప్రతిరూపమైన ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరి పై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డి.ఆర్.ఓ రామ్ రెడ్డి, డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ. ఓ సువర్ణ రాజ్, ఆర్య వైశ్య నాయకులు పాల్గొన్నారు.

**జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్ణయించి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిన సందర్భంగా ఆదివారం నాడు జడ్చర్లలోని మున్సిపల్ కార్యాలయంలోనూ, మండల కార్యాలయంలోనూ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక , జిల్లా ఆర్యవైశ్య సంఘాల నేతలు, జిల్లా అధ్యక్షులు పాలాది రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రామకృష్ణ, దాచేపల్లి చంద్రయ్య, ఎలిశెట్టి మురళి, కృష్ణ, చెన్న రావు దేవరాజ్ , నాగరాజ్, పాలాది జయకృష్ణ, జయప్రకాష్, గుబ్బ వెంకటరమణ, మున్సిపల్ చైర్మన్ కోనేలి పుష్పలత, వైస్ చైర్మన్ సారిక రామ్మోహన్, సత్యనారాయణ గుప్తా, వివిధ అధికారులు కౌన్సిలర్ లు సతీష్, ఉమా శంకర్ లు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. దానికి స్థానిక ఆర్యవైశ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నారాయణపేట్ :** స్థానిక కలెక్టరేట్‌లో ప్రజావాణి ఆఫీస్ నందు జిల్లా క్రీడా శాఖ అధికారి శెట్టి వెంకటేష్ ఏవో శ్రీధర్ ఆధ్వర్యంలో వాసవి మాత జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంనకు నారాయణపేట్ జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సుంకు ఉమేష్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధి కొత్త శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ వాసవి మాత జయంతిని అధికారికంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక మంత్రి వాకిటి శ్రీహరికి కల్వ సుజాత కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ జనరల్ సెక్రటరీ కట్టా సురేష్, శ్రీనివాస్ శెట్టి, సతీష్ పాలాది, డాక్టర్ శివ ప్రసాద్ , బొడ్డు శివప్రసాద్ పూరి వెంకటేష్, జగదీశ్, అనుపూర్ రఘునాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో వాసవి మాతా జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం/కొత్తూరు:** భక్తిశ్రద్ధలతో శ్రీ వాసవి మాతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం కొత్తూరు మండల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దయానంద్‌గుప్తా ఆధ్వర్యంలో కొత్తూరు మండల కేంద్రంలోని మందోని బాయి మైసమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దయానంద్ గుప్తా మాట్లాడుతూ శ్రీ వాసవి మాతా జయంతి వేడుకలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్యులపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఎంతో గొప్ప విషయమని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు ఎల్లప్పుడు రుణపడి ఉంటారని వివరించారు. ఆర్యవైశ్యుల గౌరవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి పని చేస్తున్నారని వివరించారు. ఆర్థిక క్రమశిక్షణ సద్వినియోగం ఆర్యవైశ్యులకే సాధ్యమన్నారు. వాసవి మాతా దీవెనలతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని దయానంద్‌గుప్తా ఆకాంక్షించారు. కార్యక్రమంలో మలిపెద్ది అనిత్‌కుమార్, వజ్రలింగం, యంసాని శివకుమార్, రాజు, మలిపెద్ది పరమేశ్వర్, గుబ్బ జ్యోతి, జూలూరి శ్రావంతి, గుబ్బ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నందిగామ మండలం ఈదుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో నిండాలని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, ఐక్యత కలగాలన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఉండే గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండే అస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ అన్నారు. దేవాలయాల అభివృద్ధికి తన సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్, మోత్కులగూడ సర్పంచ్ లావణ్యరమేష్, మోత్కులగూడ మాజీ సర్పంచ్ నర్సింహులు, ఈదులపల్లి ఉప సర్పంచ్ సంధ్య శేఖర్, నేతలు జయరాం గౌడ్, నర్సింహులు గౌడ్, వార్డు సభ్యులు కుమారస్వామి, రాలబండి అనూష శ్రావణ్ గౌడ్, శ్రీధర్ గౌడ్, జి.హన్మంత్‌గౌడ్, మౌనిక ప్రవీణ్, బస్వ శేఖర్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివేకానంద పార్క్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా

మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** స్వామి వివేకానంద పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మాజీ కార్పొరేటర్ ముద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ స్వామి వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవడంతో పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కారం చూపాలని లచ్చిరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి పార్కుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని వారు బరోస కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీధర్ రావు, విష్ణువర్ధన్ రావు, శంకరయ్య గౌడ్, చిన్న యాదవ్, సురేష్ కుమార్, సంజీవ నాయక్, వాకర్స్ అధ్యక్షులు మంచిరెడ్డి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, కార్యదర్శి జగన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, నారాయణ, రవీందర్‌రెడ్డి, రవిశంకర్, వీరస్వామి గౌడ్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటితరంగ కార్మికలకు కనీస వేతనాలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నిరుడు రవి డిమాండ్ చేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఈ నెల 1న జరిగే అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందుగానే చేతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు నిరుడు రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారులతో కుమ్ముకై 4 లేబర్ కోడ్‌లను తిసుకోచ్చి కార్మికుల హక్కులను కాలరాయాలని చూస్తుందని విమర్శించారు.కార్మికులకు 8గంటలు పని దినాలను అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే కార్మిక సంఘాల ఆద్వర్యంలో ఆందొళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కుమార్, మల్లేష్, రాజు కార్మికులు పాల్గొన్నారు.

# కూల్చివేతలన్నీ హైడ్రా ఖాతాలో వేయొద్దు

సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండించిన అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో జరుగుతున్న ప్రతి కూల్చివేతను 'హైడ్రా'కు ఆపాదిస్తూ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని హైడ్రా యంత్రాంగం తీవ్రంగా ఖండించింది. వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు చేస్తున్న ప్రచారం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని హైడ్రా ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అవగాహన లేకుండా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వార్తలు, వీడియోలను ఆక్రమణదారులు హైడ్రాపై తప్పుదారి పట్టించే ప్రయత్నాలకు వినియోగిస్తున్నారని అధికారులు తెలిపారు. నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను హైడ్రా తొలగించడం లేదని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిహెచ్‌ఎంసి, సిఎంసి, ఎంఎంసిల యంత్రాంగాలు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపును విస్తృతంగా చేపడుతున్నాయని తెలిపారు. పాతబస్తీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. హైడ్రా మాత్రం పెద్ద ఎత్తున ఆక్రమణలను తొలగించే ప్రత్యేక ఆపరేషన్‌లను నిర్వహిస్తూ, ప్రభుత్వ భూములను రక్షిస్తుందన్నారు. చెరువులు, నాలాలు, రహదారులు, పార్కుల ఆక్రమణలను తొలగించడం, గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, వరద నియంత్రణ వంటి పనులపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. పర్యావరణ హిత నగర నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా హైడ్రా కట్టుబడి పనిచేస్తోందని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.

## జిహెచ్‌ఎంసి కార్యాలయంలో.. వాసవి మాతా జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆదివారం శ్రీ వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ డైరెక్టర్ భారతి హోళికేరి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, అదనపు కమిషనర్ (పరిపాలన) కె. సత్యనారాయణ పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా శ్రీ వాసవి మాతా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అహింస, ధర్మం, సామాజిక సేవే లక్ష్యంగా జీవించిన వాసవి మాత ఆశయాలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా అధికారులు అన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2022 బ్యాచ్ ఐఎఎస్ చెందిన డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఇప్పటి వరకు బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. కాగా శనివారం ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా రంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా ఆదివారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

## ప్రతి రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుంతా తప్పక రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తద్వారా రిజిస్ట్రేషన్ ఐడి నంబరు పొందాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష రైతులకు సూచించారు. రైతు రిజిస్ట్రేషన్ అనేది ప్రతి రైతు బీమా, సబ్సిడీలు, ఇతర పథకాలు రావడానికి ఉపయోగంగా ఉంటున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాలలో పారదర్శకత కోసం, పత్తి, వరి కొనుగోలు, పంట రుణాలకు ఇది కీలకం అన్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా పొందవచ్చునన్నారు. వరి కొనుగోలు, పంట రుణాల కోసం. ప్రభుత్వ పథకాలలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ఆధార్ కార్డు, భూమి పట్టా పాసు బుక్కు, ఆధార్ లింకు మొబైల్ నంబర్, అవసరం ఉంటుందని వివరించారు. రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 22 నుండి 30 వరకు ప్రత్యేకమైన డ్రైవ్ జిల్లా మొత్తం అమలు చేయబడుతుందని డిఎఒ ఉష పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం పరచుకోవాల్సిందిగా ఆమె కోరారు.

# బాధ్యతగా ఇళ్ల గణన చేపట్టాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మొదటి దశ ఇళ్ల జాబితా, ఇళ్ల గణనలో స్వీయ నమోదు ప్రక్రియ లో జిల్లా ప్రజలు, అధికారులు బాధ్యతగా పాల్గొనాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, డిఆర్ఒ సంగీతలతో కలిసి ఇండ్ల గణనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇండ్ల గణన, స్వీయ గణన ద్వారా తమ వివరాలను పోర్టల్‌లో నమోదు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యావంతులు, ప్రజలు ఇండ్ల గణన స్వీయ నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇండ్ల గణన స్వీయ నమోదు కోసం ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. https://se.census.gov.in పోర్టల్ ద్వారా ఎవరికి వారు ఇండ్ల గణన స్వీయ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. భారత ప్రభుత్వం జన గణన 2027 ప్రక్రియను రెండు దశలలో చేపడుతోందన్నారు. మొదటి దశలో మే 11 నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన చేస్తారని కలెక్టర్ వివరించారు. రెండవ దశలో 2027 ఫిబ్రవరి 9వ తేదీ నుండి 28 వ తేదీ వరకు జనాభా గణన, కులగణన ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 26 నుండి ఇండ్ల గణన, స్వీయ గణన ప్రారంభం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు స్వీయ గణనలో పాల్గొనాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కోరారు. ఇండ్ల గణన కోసం మీ ఇంటి వద్దకు వచ్చే నమోదు అధికారికి అన్ని వివరాలు తెలియజేయాలని సూచించారు. జన గణన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా స్వీయ నమోదు చేసుకుని, ఇండ్ల గణనకు వచ్చే అధికారికి సరైన సమాచారాన్ని ఇచ్చి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా సెన్సస్ ఇన్‌చార్జ్ శిరీష, ఎన్నికల, సెన్సస్ విభాగం అధికారి వినోద్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ఏప్రిల్ 27 నుండి మే 5 వరకు నిర్వహించ తలపెట్టిన బాలల భద్రత,మాదక ద్రవ్యాలకు స్వస్తి చెప్పే సంక్షేమ వారోత్సవాల" కార్యక్రమాన్నీ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, ఐసిడిఎస్, మున్సిపల్, పోలీస్ విభాగాలకు చెందిన అధికారులతో మాదక ద్రవ్యాలకు స్వస్తి చెప్పనున్న సంక్షేమ వారోత్సవాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన మూడు అంశాలను సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా నేటి నుండి జరగనున్న"బాలల భద్రత, రక్షణ, మాదక ద్రవ్యాలకు వద్దు చెప్పండి సంక్షేమ వారోత్సవాలు" రోజువారీ కార్యక్రమాలలో అధికారులు ఇదే స్ఫూర్తి తో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితా దేవి, ఆర్డీవోలు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌పై హత్యాయత్నం.. ప్రధాన నిందితుడు పరార్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సర్పంచ్ బందయ్యపై దాడి చేసిన వ్యక్తులు పరారైన సంఘటన రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఈనెల 25న ఎల్కగూడెం గ్రామంలో ఈదమ్మ జాతర నేపథ్యంలో సర్పంచ్ బందయ్యపై అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డితోపాటు బొమ్మగల నరసింహులు, బొమ్మగల యాదయ్యతోపాటు మరికొంతమంది కలిసి ముక్కుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో సర్పంచ్ బందయ్య తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో హుటాహుటిన షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన వైద్యసేవలు అంధించారు. వెనుకబడి సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ ఎలా ఈదమ్మ జాతర ఉత్సవాలను నిర్వహిస్తారంటూ మాజీ ఎంపిటిసి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డి తన అనుచర వర్గంతో కలిసి దాడికి పాల్పడ్డారు. గతంలో సర్పంచ్ బందయ్య భార్యను సైతం రాంరెడ్డి అనే వ్యక్తి సైతం బెదిరించినట్లు గ్రామస్తులు తెలిపారు. జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయనే సమయంలోను రాంరెడ్డి తన అనుచర వర్గంతో మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. రాంరెడ్డితోపాటు అనుచర వర్గాన్ని పట్టుకునేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా వాహనాల్లో పారిపోయారు.

### సింగాపూర్‌లో వ్యాపార వేత్తగా స్థిరపడ్డ రాంరెడ్డి

జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డి సింగాపూర్‌లో వ్యాపార వేత్తగా స్థిరపడ్డాడు. పండుగలు, ఎన్నికల సమయాల్లో గ్రామానికి వచ్చి వెళ్తుంటాడని, ఈ నేపథ్యంలోనే ఈనెల 24వ తేది అర్ధరాత్రి స్వగ్రామం ఎల్కగూడెంకు చేరుకున్నారు. 25వ తేది సాయంత్రం ఈదమ్మ జాతర ప్రారంభం అవుతున్న నేపథ్యంలోనే సర్పంచ్ బందయ్యపై దాడి చేశారు. ఘటన తరువాత కారులో రాంరెడ్డితోపాటు అనుచర వర్గం పరారయ్యారు. పోలీసులు వెంబడించడంతో షాద్‌నగర్‌లో కారు వదిలి పరారు కాగా బొమ్మగల్ల నర్సింహులు, బొమ్మగల యాదయ్యలను షాద్‌నగర్‌లో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రాంరెడ్డి కారులో పాస్‌పోర్టు, ల్యాబ్‌టాప్‌లను జిల్లేడు చౌదరిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే శంకర్



వెనుకబడినవర్గానికి చెందిన సర్పంచ్ బందయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ బందయ్యను ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రజక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి సర్పంచ్ కావడం, గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తుంటే చూసి ఓర్వలేక బెదిరింపులకు పాల్పడడం, హెచ్చరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులు నింధితులను పట్టుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీ మాత దేవాలయంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఆర్యవైశ్యులది ఎంతో కీలక పాత్ర పోషించడం జరుగుతుందని, ప్రభుత్వం అధికారికంగా వాసవీ మాత జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. వ్యాపార రంగంలో రాణిస్తున్న ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, కౌన్సిలర్లు విశాల విశ్వం, మురళీమోహన్, రాజునాయక్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గందె సురేష్, సామాజిక కార్యకర్త నీల రవీందర్, మలిపెద్ది శ్రీనివాస్, సరాపు రమేష్, యంసాని శ్రీనివాస్, గడ్డం నందకిశోర్, ఉప్పల శ్రీనివాస్, గడ్డం ఆంజనేయులు, ఎల్కుర్తి నారాయణ, హన్మారి మురళీధర్, చెరుకుపల్లి సురేష్, గుంత సత్యనారాయణ, దండు రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొ.కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఉద్యమకారులు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రొఫెసర్ కోదండరామ్ రాష్ట్ర గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ సభ్యులుగా నూతనంగా నియామకం కావటంతో ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఉద్యమకారులు నగరంలో ఆయన నివాస గృహానికి పర్యటించి ఫ్రొఫసర్ కోదండరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎండి గౌస్, జంగయ్య,పి రవిందర్ గుప్త, రమేష్, అంజయ్య, ఎండి ముజీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్‌పై దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి



సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** సర్పంచ్‌పై దాడి నిందితులను కఠినంగా శిక్షించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సర్పంచ్‌లు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ హత్యాయత్నానికి పాల్పడిన రాంరెడ్డితోపాటు అనుచర వర్గాన్ని కఠినంగా శిక్షించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, వెల్‌చర్ల సర్పంచ్ బాబునాయక్, చౌలపల్లి, వెంకట్‌రెడ్డి పల్లి, దేవునిపల్లి, రాసుమల్లగూడ, పులిచర్లకుంట తండా, కిషన్‌నగర్ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

**కొత్తూరు:** ఎల్కగూడెం సర్పంచ్‌పై దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చని, ఇందుకు పాల్పడిన నింధితులను కఠినంగా శిక్షించాలని సర్పంచ్‌ల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తూరు మండల కేంద్రంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్ము కృష్ణ మాట్లాడుతూ గ్రామానికి ప్రథమ పౌరుడైన సర్పంచ్‌పై దాడి చేయడం పిరికిపంద చర్యన్నారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలను కలుపుకొని ఈదమ్మ జాతర ఉత్సవాలను నిర్వహిస్తుంటే అక్కసుతో మారణ ఆయుధాలతో దాడి చేయడం ఏమిటని పేర్కొన్నారు. హత్యాయత్నానికి పాల్పడిన రాంరెడ్డితోపాటు అనుచర వర్గాన్ని కఠినంగా శిక్షించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.





## కరాటే కాటస్‌లో గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

**ప్రజాపక్షం/చర్లపల్లి :** ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లో కుషాయిగూడ, చర్లపల్లి, నాగారంకు చెందిన ఛాంపియన్ షొటోఖాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు కరాటే కిక్సుతో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. 2 వేల మంది కరాటే విద్యార్థులతో 20 నిమిషాల వ్యవధిలో నలభై సార్లు కరాటే కాటస్ చేసి గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ చోటు సాధించారని ఛాంపియన్ షొటోఖాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, డైరెక్టర్ కరాటే కోచ్ బుడిగే రవికుమార్‌గౌడ్ తెలిపారు. విద్యార్థులు గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించడం గర్వకారణమని, విద్యార్థులకు టీ షర్ట్స్ అందజేశారు.

## ఎరుకల నూతన సంఘం అధ్యక్షుడిగా బిజిలి భిక్షపతి



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఏకలవ్య ఎరుకల సంఘం నూతన అధ్యక్షుడిగా బిజిలి భిక్షపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రెటరీగా బిజిలి నరసింహ, ట్రెజరర్‌గా కుతాడి సారయ్యలను ఎరుకల సంఘం నాయకులను ఆదివారం మైసమ్మ గుట్ట దగ్గర ఎన్నుకున్నారు. ఎరుకల సంఘానికి ఎన్నికల అధికారిగా కుతాడి భిక్షపతి, బిజిలి మైసయ్య, బిజిలి నరసింహలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బిజిలి భిక్షపతి మాట్లాడుతూ ఎరుకల కుల సంఘానికి ఎల్లవేళల అందుబాటులో ఉండి కృషి చేస్తానని అన్నారు. కుల సంఘ నాయకులకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కుతాడి రవిందర్ కుతాడి సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/కూకట్‌పల్లి :** మే ఒకటిన జరిగే ప్రపంచ కార్మికుల దినోత్సవ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన గోడపత్రాలను కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్ ఏఐటియుసి కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ, ఏఐటియుసి నేతలు మనోచారి, దావీద్, కృష్ణచారి, నారాయణ, పాండు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో ఏరియా ప్రభుత్వ ఆస్పత్రితో వైద్య సేవలు



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యావైద్య సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ ప్రాంతంలోని ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన 100 పడకల ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి సంబంధించి ఆయన ఆదివారం భూమిపూజ చేసారు. ఈ ఆస్పత్రి వల్ల ఏర్పాటు చేసే అత్యంత ఆధునిక వైద్య సేవలు పేద ప్రజానీకానికి అందుబాటులోకి వస్తాయన్నారు. అత్యవసర చికిత్సలు, సాధారణ వైద్య సేవలు, పరీక్షా కేంద్రాలు, ప్రసూతి సేవలు వంటి పలు విభాగాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** స్త్రీ యొక్క ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేసిన మహనీయురాలు వాసవి కన్యకా పరమేశ్వరి అని ఎమ్మెల్యే వివేకానంద పేర్కొన్నారు. ఆదివారం 128 చింతల్ డివిజన్ హెచ్‌ఎంటి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో చింతల్, కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్‌ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జూలూరి విజయకుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మహంకాళి ప్రభురాజ్, ఇల్లందుల కృష్ణ, వాడగూరి రాజు, ఉపాధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, వీరేంద్రగుప్తా తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** జర్నలిస్టుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆదివారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించింది. ప్రెస్‌క్లబ్ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరంలో జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా అత్యాధునిక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా వైద్య బృందం ఓరల్ స్క్రీనింగ్, చెస్ట్ ఎక్స్‌రేలతో పాటు మహిళల కోసం పాప్ స్మియర్, బ్రెస్ట్ ఎగ్జామినేషన్, మామోగ్రఫీ వంటి కీలక పరీక్షలను నిర్వహించింది. అంతేకాకుండా మెడ, పొట్ట, పొత్తికడుపు భాగాలకు అల్ట్రాసౌండ్ పరీక్షలు చేసి, నిపుణులైన వైద్యులతో ఉచిత కన్సల్టేషన్ కల్పించారు. క్యాన్సర్ పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ వైద్యులు అవగాహన కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.విజయ్ కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రమేష్ వరికుప్పల మాట్లాడుతూ.. క్యాన్సర్ అనేది చాప కింద నీరులా విస్తరిస్తున్న వ్యాధి అని, ప్రాథమిక దశలోనే దీనిని గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. జర్నలిస్టుల కోరిక



మేరకు తక్షణమే స్పందించి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన బసవతారకం హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అత్తలూరి అరుణ, జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, ఈసీ మెంబెర్లు రచన ముదుంబై, రాజేశ్వరి కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.



## డిసిసి కుమారుడి పెళ్లికి హాజరైన మంత్రి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ రెండవ కుమారుడి పెళ్లికి సిఎంతో పాటు జిల్లా ఇంచార్జ్, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విచ్చేసి నూతన జంటను ఆశీర్వదించారు. నగరంలో జరిగిన ఈ పెళ్లి వేడులకు పురప్రముఖులు, పలు రాజకీయ నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కమతం శీరీషా కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మూడుచింతలపల్లి మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మేడే ఉత్సవాలు జయపద్రం చేయండి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ప్రపంచ కార్మిక వర్గాల ఐక్యతకు ప్రతీక అయిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. ఆదివారం జగద్గిరిగుట్టలో భవన నిర్మాణ కార్మికులు మేడే గోడ పత్రికను ఉజ్జిని హరినాథ్‌రావు అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని మేడే వేడులను విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుత కాలంలో కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లు, కనీస వేతనాలు, పని గంటలు, సంక్షేమ పథకాలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, భవన నిర్మాన కార్మికులు ముసలయ్య, రాజు, యాదయ్య, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల అలసత్వం - ప్రయాణికుల ఇక్కట్లు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల నేపథ్యంలో బస్ స్టాప్‌లను నల్ల చెరువు కట్టకు తాత్కాలికంగా మార్చడం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. కనీస సౌకర్యాలు లేకపోవడం, స్పష్టమైన సూచనలు లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉప్పల్ రింగ్ రోడ్డులో ఉన్న ప్రధాన బస్ స్టాప్‌లను అధికారులు తాత్కాలికంగా నల్ల చెరువు కట్ట సమీపానికి మార్చారు. వరంగల్, హనుమకొండ, యాదగిరిగుట్ట, తొర్రూర్ వంటి ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఇప్పుడు ఈ కొత్త స్టాప్ నుంచే నడుస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు, నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ మార్పులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అయితే అమలులో స్పష్టత లేకపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. కొంతమంది డ్రైవర్లు పాత స్టాప్ వద్దకు వెళ్లగా ట్రాఫిక్ పోలీసులు తిరిగి నల్ల చెరువు వైపు మళ్లించడం సమస్యను మరింత పెంచుతోంది. ఎండాకాలం నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులు రెట్టింపయ్యాయి. తాగునీటి సదుపాయం లేకపోవడం, కూర్చునేందుకు బెంచీలు లేకపోవడం, సరైన షెల్టర్ లేకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కేవలం టెంట్ ఏర్పాటు చేయడంతో సరైన రక్షణ లభించడం లేదు.



అదనంగా ఏ బస్సు ఎక్కడ ఆగుతుందో తెలియజేసే సూచిక బోర్డులు లేకపోవడం వల్ల ప్రయాణికులు అయోమయంలో పడుతున్నారు. దుబ్బ రోడ్ల కారణంగా ఎగిసిపడే దుమ్ము పరిస్థితిని మరింత కష్టతరం చేస్తోంది. ముందస్తు ప్రణాళికతో బస్ స్టాప్‌ల మార్పు చేపట్టిన అధికారులు, ప్రయాణికుల సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించారని ప్రజలు విమర్శిస్తున్నారు. తక్షణమే తాగునీరు, బెంచీలు, షెల్టర్లు, స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ హాస్టలే విద్యార్థులకు బంగారు బాట



ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ జాల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ వారోత్సవాల భాగంగా ఆదివారం ఘట్‌కేసర్ సర్కిల్ 6 వ డివిజన్‌లో అంబేద్కర్‌నగర్ కాలనీలో జిల్లా ఎస్సీ దేవలప్మెంట్ అధికారి జీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో హాస్టల్ బాట కార్యక్రమం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ అధికారి స్వయంగా ఎస్సీ బస్తీలో తిరిగి అక్కడి తల్లిదండ్రులతో మాట్లాడితే వారి నుంచి మంచి స్పందన వచ్చిందని అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో అందిస్తున్న నాణ్యమైన విద్య, సురక్షత వసతి, పోషకాహారం ఇతర సదుపాయాల గురించి వివరించారు. తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పించాలని పిల్లల ప్రగతికి హాస్టల్ బాట నిజమైన బంగారు బాట అని ఆయన పేర్కొన్నారు. హాస్టల్ బాట కార్యక్రమం ద్వారా గ్రామీణ పేద విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించి వారి భవిష్యత్తును వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎస్సీ దేవలమ్మెంట్ అధికారి గోపీచంద్, వెల్ఫేర్ అధికారి ధాన్య నాయక్, కాంత్రి రెడ్డి, మహేష్, లక్షయ్య, కృష్ణ, ఊర్మిళతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటిక నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు పట్టణంలోని అంతారం సమీపంలో మార్వాడి సమాజానికి కేటాయించిన స్థలంలో శ్మశానవాటిక నిర్మాణానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదివారం మార్వాడి సమాజం పెద్దలతో కలసిన శ్మశాన వాటిక నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలను సమన్యాయం చేయడమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. మార్వాడి సమాజానికి గతంలో కెటాయించిన స్థలం వాగు ఉధృతికి కొట్టుకు పోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దీంతో మార్వాడి పెద్దల కోరిక మేరకు అంతారం సమీపంలో స్థలం కెటాయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బుయ్యాని శ్రీనివాస్‌రెడ్డి తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నీరాజ బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ నర్సిములు, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, కౌన్సిలర్‌లు, మార్వాడి సమాజ్ పెద్దలు పాల్గొన్నారు.

**అధికారికంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఉత్సవాలు**

కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారికంగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషదాయకమని తాండూరు ఎమ్మెల్యే



బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని శ్రీ నగరేశ్వరి స్వామి దేవాలయంలో ప్రభుత్వం అధికారింగా నిర్వహించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరాజబాల్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ పట్లోళ నర్సిములు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, విజయక్ష్మి, వాసవి మహిళ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



## స్వీయగణనను అందరూ వినియోగించుకోవాలి

కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జనగణనలో భాగంగా ఆదివారం నుండి మే 10వ తేదీ వరకు జరుగనున్న స్వీయగణనను జిల్లావాసులందరూ వినియోగించుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి కోరారు. పౌరులు ఎక్కడి నుండైనా సుమారు 15 నిమిషాల్లో తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకొనే వీలుగా ప్రత్యేకంగా రూపొందించిన se.census.gov.in పోర్టల్, యాప్‌ల్లో మిగతా వాటి మాదిరిగా ఓపెన్ చేసి తమ మొబైల్ ఫోన్ నంబరు నమోదు చేసి దానికి వచ్చే ఓటిపి, ఆ తర్వాత భాష, లొకేషన్, జిల్లా, మండలం, వార్డు, పిన్‌కోడ్ వివరాలతో ధృవీకరణ పూర్తయిన తర్వాత ఒక దాని వెంట అడిగే ప్రశ్నలకు జవాబులిస్తూ పూరించాలన్నారు. కుటుంబ సభ్యుల సంఖ్య, అద్దె ఇల్లా, సొంత ఇల్లా, వంట గ్యాస్, టివి, ఫ్రిజ్, వాహనాల వంటి ప్రశ్నలన్నింటికి జవాబిచ్చి సబ్మిట్ బటన్ నొక్కి ఆ తర్వాత తమకు వచ్చే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడిని గుర్తుంచుకొని తదుపరి జనగణనకు సంబంధించి వచ్చే అధికారులకు తెలియచేయాలన్నారు. డిజిటల్ పద్దతిలో వివరాలను తెలియచేయటం ద్వారా దేశాభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములు కావాలని కోరారు.

## నేటి నుండి మే 23వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

**ప్రజాపక్షం/తాండూరు :** జిల్లాలోని రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ వానాకాలం సాగుకు రైతులను సన్నదం చేసెందుకు గాను ఈ నెల 27నుండి మే 23వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విద్యాలయం ప్రతిష్టాత్మకంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని చేపట్టబోతుందన్నారు. జిల్లాలోని 40 గ్రామాలలో నెల రోజుల పాటు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపైన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయన్నున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో పాటించాల్సిన శాస్త్రీయ సలహాలను సూచనలను నేరుగా రైతు ముంగిట్లోకి తీసుకవెళ్ళాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని వర్షాకాలానికి ముందస్తుగానే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలు రైతు వేదికలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని శాస్త్రవేత్తలు సూచించే సూచనలు, సలహాలను పాటించి అధికంగా లబ్ది పొందాలని సూచించారు.



## పొంచి ఉన్న ప్రమాదం...

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**ప్రజాపక్షం/మర్పల్లి :** వికారాబాద్ నియోజకర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని నర్సాపూర్ తండా శివారులో కల్వర్టు కుంగి రంధ్రం ఏర్పాడింది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారిలో గుంత పడడంతో పెను ప్రమాదం పొంచి ఉంది. గుంతపడి ఐదునెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఓట్ల కోసం ఇండ్ల చుట్టు తిరిగే నాయకులు ఇలాంటివి వారికి కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ప్రమాదాలు జరగకముందే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# ఎంసిపల్లిలో జోరందుకున్న అక్రమ నిర్మాణాలు

అడ్డుకట్ట వేయని అధికారులు..
తూతూ మంత్రంగా నోటీసులు
కార్యాలయానికే పరిమితమైన అధికారులు
మున్సిపల్ ఆదాయానికి గండిపడుతున్న వైనం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లిలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. కళ్లేదుటే అక్రమ నిర్మాణాలు కనిపిస్తుంటే మాకేందుకులే అని పట్టింపు లేకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు దారి తీస్తుంది. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేవా అనే విషయం కూడా అధికారులకు తెలియడం లేదంటే అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో అర్థం అవుతుంది.

**అధికారుల పర్యవేక్షణ లోపం..**

కాగా నూతనంగా ఏర్పడిన మున్సిపల్ మొత్తం 24 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో లక్ష్మాపూర్, లింగాపూర్‌తాండ, ఉద్దెమర్రి అనుబంధ గ్రామమైన ఉషార్‌పల్లి, కొల్తూర్‌లో అక్రమంగా భవనాలు, గెస్ట్‌హౌస్‌లు, షెడ్లు వెలుస్తున్నాయి. వీటిని టౌన్ ప్లానింగ్ అధికారి పర్యవేక్షణ చేయాలి. కానీ ఎక్కడ కూడ ఆ అధికారి పర్యవేక్షించిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు పూర్తయినా అసెస్‌మెంట్ చేసి



ట్యాక్స్‌లు విధించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మున్సిపల్ అధికారులకు సాక్షాత్తు కౌన్సిలర్లు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా మున్సిపల్ కమిషనర్ తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని బహిరంగంగా చర్చ జరుగుతోంది.

**టౌన్‌ప్లానింగ్ అధికారి పర్యవేక్షిస్తారు..**
**కమిషనర్ పవన్‌కుమార్**

మున్సిపల్‌లో నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి చూసుకుంటారని మా దృష్టికి వచ్చిన వాటికి నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేవా అనే విషయమై డాక్యుమెంట్‌లు చూసి వాటికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

## ఆలయ అభివృద్ధికి పాటుపడుతా



కమిటీ అధ్యక్షుడు కురువ మాణిక్యం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** హన్‌మాన్ ఆలయం అభివృద్ధికి పాటు పడుతా అన్ని విధాలుగా శ్రీఅంజయస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని కమిటీ అధ్యక్షుడు మణిక్యం అన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు ధన్నారం గ్రామంలో శ్రీ అంజయస్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు స్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. కమిటీ అధ్యక్షుడు కురువ మాణిక్యం, ప్రధాన కార్యదర్శి దోడ్ల ఆనందం, కోశాధికారి తెలుగు లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు వద్దే రవి, ఈ ప్రభాకర్ రెడ్డి సి.మహిపాల్, ఎస్.జంగయ్యలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన గ్రామ ప్రజలకు ధన్యావాదాలు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా అందర్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానన్నారు. శ్రీఅంజనేయ స్వామి అలయ అభివృద్ధి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

